సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



జూరాలకు ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸



మరో సైబర్ నేరం

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మరో వ్యక్తి రూ.80 వేల నగదు పోగొట్టుకున్నాడు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.3 /21.1

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో మహా రథోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం పరిమళగిరి రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించిన స్వామివారి 353వ ఆరాధనోత్సవాలు గురువారం మహా రథోత్సవంతో ముగిశాయి. చివరి రోజు ఉత్తరారాధన వేడుకలు నిర్వహించారు. ఉదయం రాఘవేంద్రస్వామి బృందావనానికి విశేష ఫలపంచామృతాభిషేకం చేపట్టి వివిధ రకాల పుష్పాలతో అలంకారం చేశారు. భక్తుల అష్టోత్తరం, స్తోత్ర పారాయణాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి భజన కీర్తనల నడుమ వీధుల్లో కనులపండువగా ఊరేగించారు. మఠం నుంచి ప్రధాన వీధుల గుండా రథోత్సవం శోభాయాత్ర చేపట్టారు. పండితులు, వేదమంత్రాలతో స్వస్తి వచనం, మహా మంగళహారతి పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం ప్రధాన అర్చకులు దివాన్‌జీ గురురాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద ఉన్న ఆర్వీఎం సమావేశ మందిరంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉపకరణాల పంపిణీ కోసం ఆలింకో సంస్థ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 296 మంది పరీక్షలకు హాజరయ్యారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను తీసుకువచ్చిందని, వారు అన్ని రంగాల్లో ఎదిగేందుకు, చదువుకుని ఉన్నతంగా ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు ఓపికగా చిన్నారుల్లో మార్పుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ అస్గర్ అలీ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

27న విద్యావ్యవస్థపై సదస్సు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మిషన్ ఎడ్యుకేషన్ తెలంగాణలో భాగంగా రాష్ట్ర లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లాకేంద్రంలోని వీవీ కన్వెన్షన్‌లో 'విద్యావ్యవస్థపై సమాలోచన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కత్తి వెంకటస్వామి గురువారం తెలిపారు. జిల్లాకేంద్రంలోని జలజం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని, మొదట పాలమూరు యూనివర్సిటీ పరిధిలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆస్పత్రి సిబ్బంది తీరుపై అడిషనల్ కలెక్టర్ ఆగ్రహం



అడ్డాకుల: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో డాక్టర్‌తో పాటు విధుల్లో ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్నవారు డాక్టర్ మీటింగ్‌కు వెళ్లారని చెప్పడంతో.. దీనిపై డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతానన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ఆయుర్వేద వైద్యకేంద్రం, ఐకేపీ కేంద్రాన్ని సందర్శించారు. ఐకేపీ కేంద్రంలో కుడుతున్న యూనిఫాంలను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీ కార్యదర్శి సరస్వతితో మాట్లాడారు. పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం సుధీర్‌కుమార్, ఆయుర్వేద వైద్యురాలు లావణ్య తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 26295 నంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

డీసీసీబీ పీఠం ఎవరికో..

నేడు చైర్మన్ పదవికి ఎన్నికలు

- ఏకగ్రీవం దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు
- 'హస్తం' నుంచి రేసులో మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి
- బ్యాంక్ డైరెక్టర్లతో ఇప్పటికే మంతనాలు పూర్తి
- బీఆర్‌ఎస్‌లో తెరపైకి మంజులారెడ్డి పేరు
- బలం తమకే ఉందని.. గెలుస్తామని 'కారు' నేతల ధీమా



ఎన్నిక వేదిక	: డీసీసీబీ కార్యాలయ ఆవరణం
నామినేషన్ల స్వీకరణ	: ఉదయం 9 నుంచి 11 గంటల వరకు
నామినేషన్ల పరిశీలన	: 11 నుంచి 11.30 గంటల వరకు..
ఉపసంహరణ	: మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు..
అభ్యర్థుల ప్రకటన	: మధ్యాహ్నం 2.30 గంటలకు..
పోలింగ్ (బ్యాలెట్)	: 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..
ఓట్ల లెక్కింపు	: 5.30 గంటలకు.. వెంటనే ప్రకటన



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ ఎన్నికకు రంగం సిద్ధమైంది. శుక్రవారం బ్యాంక్ ఆవరణలో ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న నిజాంపాషా (బీఆర్‌ఎస్) అనారోగ్య కారణాలతో రాజీనామా చేయగా.. ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ పదవిని దక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. గణాంకాల ప్రకారం బీఆర్‌ఎస్‌కే ఎక్కువ మంది డైరెక్టర్ల బలం ఉన్నా.. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో తమ అభ్యర్థి గెలుపు ఖాయమనే ధీమా హస్తం నేతల్లో వ్యక్తమవుతోంది. గులాబీకి చెందిన డైరెక్టర్లందరి మద్దతు కూడగట్టి.. ఏకగ్రీవం చేసే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

డైరెక్టర్లతో మామిళ్ల మంతనాలు..

డీసీసీబీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ తగిన ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికను ఏకగ్రీవం చేసేలా పావులు కదుపుతోంది. కొల్లాపూర్ నియోజకవర్గం, వనపర్తి జిల్లా పాన్‌గల్ పీఏసీఎస్ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకునేలా పక్కా ప్లాన్ అమలు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, విష్ణువర్ధన్‌రెడ్డికి మధ్య గతం నుంచీ విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి ముఖ్య అనుచరుడుగా విష్ణువర్ధన్‌రెడ్డికి పేరుంది. ఈ మేరకు మల్లురవి అన్నీ తానై నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌తో చర్చించిన ఆయన జూపల్లితో సయోధ్య కుదిర్చినట్లు సమాచారం. జూపల్లి సైతం ఆయనకు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఇటీవల కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నేత బంధువుల ఫంక్షన్‌ను వేదికగా చేసుకుని.. మహబూబ్‌నగర్, ఆమనగల్లు, మేకగూడ, గోరిట, కోస్గి, నారాయణపేట, కొత్తకోట, షాద్‌నగర్, పుటాన్‌దొడ్డి, ఉప్పునుంతల, వెంకటాయపల్లి, కోడూరు, అయోధ్యనగర్ పీఏసీఎస్ డైరెక్టర్లతో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా తనకు అవకాశం ఇవ్వాలంటూ మామిళ్లపల్లి అందరి మద్దతు కోరినట్లు సమాచారం.

బీఆర్‌ఎస్ నుంచి మంజులారెడ్డి..

డీసీసీబీ పీఠం కోసం కాంగ్రెస్ నుంచి మామిళ్ల పోటీ పడుతుండగా.. బీఆర్‌ఎస్ నుంచి మరికొందరి పేర్లు విన్పిస్తున్నాయి. మహబూబ్‌నగర్ పీఏసీఎస్ డైరెక్టర్, డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య బరిలో ఉంటారనే సంకేతాలు వచ్చినా.. ఆయన ప్రస్తుతం మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్‌కే బలం ఉందని.. గెలుస్తామని.. బరిలో నిలిచే అవకాశం ఉందని పేర్కొన్న ఆయన పరిస్థితి చేజారిందంటూ ఇటీవల తన సన్నిహితులతో చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు షాద్‌నగర్ నియోజకవర్గంలోని మేకగూడ బీఆర్‌ఎస్ డైరెక్టర్ కె.మంజులారెడ్డి పేరు పార్టీ వర్గాల్లో విన్పిస్తోంది. అత్యధిక డైరెక్టర్లు బీఆర్‌ఎస్ పార్టీకే ఉండగా.. ఆ నమ్మకంతో పోటీకి సిద్ధమవుతున్నట్లు ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఏదేమైనా కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ఎన్నికలో డైరెక్టర్లకు పెద్ద ఎత్తున నజరానాలు అందనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

బీఆర్‌ఎస్ 12.. కాంగ్రెస్ 3..

పాలమూరు డీసీసీబీ పరిధిలో మొత్తం 77 ప్రాథమిక సహకార కేంద్రాలు (పీఏసీఎస్) ఉండగా..15 డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2020 ఫిబ్రవరి 19న డీసీసీబీ ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా మక్తల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా గెలుపొందిన నిజాంపాషాను ఎన్నుకున్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఇటీవల చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. గత ఎన్నికల ప్రకారం మొత్తం 15 మంది డైరెక్టర్లలో బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా 12 మంది సంఖ్యా బలం ఉంది. కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్లు ముగ్గురే ఉన్నారు. ఎనిమిది మంది మద్దతు ఎవరికి ఉంటే.. వారే చైర్మన్‌గా విజయం సాధించనున్నారు. తాజా లెక్కల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ జక్కా రఘునందన్ ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు.

ఉత్సాహంగా 'యోగా' క్రీడాకారుల ఎంపికలు




మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లా యోగా క్రీడాకారులు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.బాల్‌రాజు మాట్లాడుతూ యోగా ఎంపికలను 160 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధి చెన్న వీరయ్య, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్, యూ.శ్రీనివాసులు, సూర్యప్రకాశ్, నర్సింలు, షంసీర్ అలీ, కిషన్‌దాస్, చంద్రశేఖర్, అరుణజ్యోతి, మణికంఠ, నాగరాజు, పవన్‌కుమా ర్, బాలమణి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 21.4 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకు పెరుగుతుంది. గురువారం సాయంత్రం 21.4 అడుగులకు చేరుకుంది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పంపింగ్ చేస్తుండగా ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు అలుగుస్థాయి నీటి మట్టం 26.6 అడుగులు కాగా మరో 5.2 అడుగుల నీరు చేరితే అలుగు స్థాయికి చేరుకుంటుంది. ప్రస్తుతం పెద్ద వాగు ప్రవాహం తక్కువగా ఉన్నా ఎత్తిపోతల నీటితో వానాకాలం పంటల సాగుకు వదులుతూ మరోవైపు ప్రాజెక్టును నింపుతున్నారు.

ట్రామా'కేర్' ఏది?



- జాతీయ రహదారులపై నిత్యకృత్యంగా మారిన ప్రమాదాలు
- సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్న క్షతగాత్రులు
- అందుబాటులో ట్రామాకేర్ సెంటర్ లేక అవస్థలు
- జడ్చర్ల, బాలానగర్ ఆస్పత్రుల్లో ఏర్పాటుచేస్తే మేలు

జడ్చర్ల: ఓవైపు ఎన్‌హెచ్–44, మరోవైపు ఎన్‌హెచ్–167తో పాటు అంతర్రాష్ట్ర రహదారులతో కూడిన జడ్చర్ల పట్టణంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు కలగానే మారింది. కొన్నేళ్లుగా ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ.. ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నాయి. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు నిలిచే పరిస్థితి లేకుండా పోయింది. ఇక్కడ సరైన సదుపాయాలు, వైద్యులు లేకపోవడంతో ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఫలితంగా క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు.

■ ప్రమాదాల్లో గాయపడిన వారిలో చాలా మంది తీవ్రమైన రక్తస్రావం, అంతర్గత రక్తస్రావం, గాయాలతో మానసిక భయాందోళనకు లోనవుతారు. అలాంటి వారిని ప్రమాదం జరిగిన వెంటనే (గోల్డెన్ అవర్)లో ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించడం వల్ల ప్రాణాలపై భరోసా కల్పించినట్లు అవుతుంది. తద్వారా 20–30 శాతం మంది ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. క్షతగాత్రులకు వైద్యసేవలు అందించడం కోసం జాతీయ రహదారులకు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని ట్రామాకేర్ సెంటర్లలో ప్రత్యేకంగా ముగ్గురు ఆర్థోపెడిక్ డాక్టర్లతో పాటు మత్తు మందు ఇచ్చే డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని నియమిస్తారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన ట్రామాకేర్ సెంటర్లను జడ్చర్ల, బాలానగర్‌లలో ఏర్పాటు చేస్తే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చు.



జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి

అటకెక్కిన ప్రతిపాదనలు..

మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ట్రామా కేర్ సెంటర్‌కు క్షతగాత్రులను తరలించడంలో ఆలస్యం అవుతుండటంతో సకాలంలో వైద్యం అందడం లేదు. జడ్చర్ల పట్టణంలోనే ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే, క్షతగాత్రులకు సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుంది. అంతేగాక అన్ని దిక్కుల నుంచి సులభంగా జడ్చర్లలోని ట్రామాకేర్ సెంటర్‌కు చేరుకునే విధంగా మార్గాలు ఉన్నాయి. వీటితో పాటు అటు హైదరాబాద్, ఇటు కర్నూలు ప్రాంతాలకు సైతం జడ్చర్ల అనుకూలంగా ఉంది. గతంలో బాదేపల్లి ఆస్పత్రికి అనుబంధంగా ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసే విధంగా కొన్నేళ్ల క్రితం స్థానిక పాలకులు చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. ఆ తర్వాత ట్రామాసెంటర్ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏర్పాటుకు కృషి..



రెండు జాతీయ రహదారులకు కేంద్రంగా ఉన్న జడ్చర్లతో పాటు 44వ నంబర్ జాతీయ రహదారి కలిగి ఉన్న బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రులలో ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తా. ట్రామాకేర్ సెంటర్లతో రోడ్డు ప్రమాద క్షతగాత్రుల ప్రాణాలను కాపాడుకునే అవకాశం లభిస్తుంది. విషయాన్ని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

ఆస్పత్రుల్లో ఫీజుల పట్టిక తప్పనిసరి


- వ్యాధులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వండి
- ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలను ఆదేశించిన కలెక్టర్ విజయేందిర



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందించే సేవల ఫీజుల వివరాలు ప్రదర్శించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. అత్యవసరమైతే తప్ప రోగులను ఆస్పత్రుల్లో చేర్చుకోవద్దని, అలాగే అన్ని జ్వరాలు డెంగీ, మలేరియా, చికున్ గున్యా కావని, జ్వరాల నిర్ధారణలో పూర్తిగా రాపిడ్ టెస్ట్‌పై ఆధారపడకుండా ఎలిసా టెస్ట్ చేసిన తర్వాత నిర్ధారించాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా ప్రైవేట్ ఆస్పత్రులలో ఎలిసా టెస్ట్ లేనట్లయితే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని చెప్పారు. ప్రజలలో డెంగీపై అనవసరమైన భయాలను కల్పించవద్దని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డీసీహెచ్‌ఎస్ సలహాలు సూచన ప్రకారం కేసులను నిర్ధారించాలని తెలిపారు. ఈ సీజన్ పూర్తయ్యే వరకు నమోదయ్యే వ్యాధులపై తప్పకుండా ప్రతిరోజు సమాచారాన్ని అందించాలన్నారు. ఎన్ని కేసులు పాజిటివ్ వస్తున్నాయి? ఎలా చికిత్స అందిస్తున్నారో తెలియజేయాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని, ఫాగింగ్ నిర్వహణ, దోమలు వృద్ధి చెందకుండా చర్యలను చేపడుతున్నామన్నారు. జ్వరాల బారిన ప్రజల్లో భయం కల్పించకుండా, మానవతా దృక్పథంతో చికిత్స అందించాలన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమ లు చేయాలని, ఎట్టి పరిస్థితులలో పుట్టబోయేది మగ, ఆడ అనే విషయాన్ని తెలియచేయవద్దని కోరారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 60 శాతం ఆస్పత్రులు వారు ఇస్తున్న సేవల ఫీజులను ప్రదర్శిస్తున్నారని, తక్కిన వారి ద్వారా సైతం వివరాలను ప్రదర్శించే ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పద్మశ్రీ, సూపరింటెండెంట్ సంపత్, పాల్గొన్నారు.

రైతుల కోసం ఆమరణ దీక్షకు సిద్ధం



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- తెలంగాణ చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయాలని, అందుకోసం ఆమరణ దీక్ష చేయడానికైనా తాను సిద్ధమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. త్వరలో రైతు పోరుపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలోని తెలంగాణచౌరస్తాలో రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో రైతులకి సకాలంలో రుణమాఫీ, రైతు బంధు, విత్తనాలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిపోయి, రైతులను మోసం చేసిందని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం రకరకాల ఆంక్షలు పెట్టి రుణ మాఫీని లక్షలాది మంది రైతులకు ఇవ్వకుండా చేసిందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా.. రుణ మాఫీ కాలేదని, రైతు బంధు రాలేదని, పింఛన్లు ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు వద్ద రైతులు ఆందోళన చేస్తుంటే.. తిన్నది అరగక చేస్తున్నారని ప్రభుత్వంలో ఉన్న వారు మాట్లాడడం సిగ్గు చేటని మండిపడ్డారు. రైతుల పక్షాన బీఆర్‌ఎస్ ఆందోళన చేస్తుంటే రాజకీయ దీక్షలని అంటున్నారని అన్నారు. అనంతరం న్యూటౌన్‌లోని బ్యాంక్ వద్దకు రుణమాఫీ కాలేదని వచ్చిన రైతులతో మాజీ మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయసంస్థల మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సిములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రహమాన్, ముడా మాజీచైర్మన్ గంజి వెంకన్న, మాజీ ఎంపీపీ బాలరాజు, నాయకులు గోపాల్‌యాదవ్, శివరాజు, దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రవీణ్, గణేష్, అనంతరెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న నీట్, ఈఏపీసెట్ శిక్షణ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలంటే పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కార్పొరేట్ కళాశాలల స్థాయిలో నాణ్యమైన శిక్షణ అందించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ బాలుర, బాలికల, ఎంవీఎస్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి వంద మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరు ఇంజినీరింగ్, మెడిసిన్ సీట్లు సాధించేలా కృషి చేయాలని, అందుకు అధ్యాపకులు, రిషి, ప్రతిభ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కూడా సహకరించడం గొప్ప విషయమన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగా భవిష్యత్‌లో అన్ని కళాశాలు, పాఠశాలల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో శిక్షణ అందించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికాబద్ధంగా చదివితే జీవితంలో వీలైనంత త్వరగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. డీఐఈఓ ఉమామహేశ్వర్ రావు, ప్రిన్సిపల్ భగవంతాచారి, ఈడబ్ల్యూ ఐడీసీ అధికారులు రాంచందర్, రాజేందర్‌రెడ్డి, రిషి విద్యా సంస్థల అధినేత వెంకటయ్య, ప్రతిభ కళాశాల ప్రతినిధి వెంకటరామయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అచ్చంపేట: అచ్చంపేట–హైదరాబాద్ ప్రధాన రహదారిలో వైజంక్షన్ దగ్గర రోడ్డు ప్రమాదంలో బొల్లట్‌పల్లికి చెందిన బాలరాజు(32)దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాలరాజు బొల్లట్‌పల్లి–వై జంక్షన్ నుంచి హాజీపూర్ వైపు వెళ్తుండగా, దేవరకొండ నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్ తప్పించబోయి వెనకాల ఉన్న మరో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల ఉన్న ఆటోను సైతం కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు బైక్‌పై ఉన్న లత్తీపూర్‌కు చెందిన మల్లేష్, శ్రీనులు ఎదురుగా వస్తున్న కారును గమనించి తప్పించుకునే ప్రయత్నంలో కిందపడడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని అచ్చంపేట ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ఆటో, కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

హైవేపై ముమ్మళ్లపల్లి వద్ద..

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. పెబ్బేరు మండలం అయ్యవారిపల్లికి చెందిన బుచ్చమ్మ (55) అనారోగ్యంతో నాలుగు రోజుల కిందట తన కుమార్తె గ్రామమైన ముమ్మళ్లపల్లికి వచ్చింది. గురువారం తెల్లవారుజామున నిద్రలేచి రోడ్డుపైకి వచ్చిన బుచ్చమ్మను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కుమార్తె చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పాముకాటుతో వివాహిత..

ఆత్మకూర్: పాముకాటు వల్ల వివాహిత మృతి చెందిన సంఘటన గురువారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ బీచుపల్లి వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిప్డంపల్లికి చెందిన సువర్ణమ్మ(38) గురువారం తెల్లవారు జామున ఇల్లు శుభ్రం చేస్తుండగా పాముకాటు వేసింది. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమెను దేవరకద్ర మండలం రాచాలకు చెందిన రాములుతో వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఆమె భర్తతో విభేదాలు రావడంతో ఏడాది కాలంగా తిప్డంపల్లిలో తల్లిదండ్రులతో ఉంటోంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మక్తల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సోమేశ్వర్ బండలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మక్తల్ మండలం సోమేశ్వర్‌బండకు చెందిన బాల్‌రాజ్ (30) తాగుడుకు బానిసై ఇంట్లో భార్య శ్రీదేవితో ప్రతిరోజు గొడవ పడేవాడు. ఈనెల 21న భార్యతో గొడవ పడి ఇంట్లో పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6 గంటలకు మృతి చెందాడు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో సర్వే నంబర్ 436లో గల 1.22 ఎకరాల భూమిపై సివిల్ కోర్టులో కేసు నడుస్తుంది. అయితే అదే గ్రామానికి చెందిన ఒక వర్గం వారు ఈ నెల 14న పొలం వద్ద కంపచెట్లు తొలగించేందుకు రాగా, మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీసిందని ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఇరువురి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడికి జైలుశిక్ష

గోపాల్‌పేట: ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం చేసిన యువకుడికి కోర్టు తొమ్మిది నెలల జైలుశిక్షతో పాటు రూ. రెండు వందల జరిమానా విధించిందని గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జనవరిలో మండల కేంద్రంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో దొంగతనం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. మరుసటి రోజు ఏదుట్ల రోడ్డులో ఎస్‌ఐ, సిబ్బంది సాధారణ తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి జనార్దన్ అనే యువకుడు పారిపోయాడు. వెంటనే అతడిని పోలీసులు వెంబడించి పట్టుకుని విచారణ చేయగా.. గోపాల్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, గోపాల్‌పేటలో కిరాణ షాపులో, ఇంటి వద్ద నిలిపి ఉన్న ద్విచక్రవాహనంతో పాటు మొత్తం మూడు దొంగతనాలు చేశానని జనార్దన్ ఒప్పుకున్నాడు. నిందితుడిని వనపర్తి కోర్టులో హాజరుపర్చగా.. నేర నిరూపణ కావడంతో జడ్జి యువకుడికి తొమ్మిది నెలల జైలుశిక్ష, రూ.రెండు వందల జరిమానా విధించారు.

ఆనందం ఆవిరి..

- లారీ కిందపడి తల్లీకూతురు దుర్మరణం
- రాఖీ పండుగకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
- మృతురాలు మూడు నెలల గర్భిణి
- బైక్ నడుపుతున్న వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం
- పండగ పూట విషాదం నింపిన ఘటన


రేఖ (ఫైల్)


సాత్విక (ఫైల్)

జడ్చర్ల: తన సోదరుడికి రాఖీ కట్టి సంతోషంగా అత్తింటికి బయలుదేరిన ఆ తల్లి ఆనందం.. మరికొద్దిసేపట్లో తండ్రి వద్దకు వెళ్తానన్న ఆ చిన్నారి ఆశలు.. అన్నీ ఆవిరయ్యాయి.. మరో 2 కి.మీ., ప్రయాణిస్తే ఇంటికి చేరుకుంటామనే లోపు లారీ రూపంలో వెంటాడిన మృత్యువు తల్లీకూతుళ్లు ఇద్దరినీ కబళించింది. చిన్నపాటి ఏమరుపాటు.. నిర్లక్ష్యపు డ్రైవింగ్ భర్తకు భార్యను, తండ్రికి కూతురిని దూరం చేసింది. ఈ విషాదకర సంఘటనకు సంబంధించి వివరాలిలా.. జడ్చర్ల మండలం లింగంపేటకు చెందిన రేఖ(23), తన కూతురు సాత్విక(4)తో కలిసి రెండు రోజుల కిందట నాగర్‌కర్నూల్ జిల్లా ఎదిరేపల్లి గ్రామానికి రక్షాబంధన్ సందర్భంగా సోదరుడికి రాఖీ కట్టేందుకు వెళ్లింది. అక్కడ బోనాల పండుగ ఉండడంతో రెండు రోజుల పాటు అక్కడే ఉంది. అయితే లింగంపేటలోనూ బోనాల పండుగ ఉండటంతో గురువారం భర్త చెన్నకేశవులు పండుగ కోసం రావాల్సిందిగా ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆమె చెల్లెలు భర్త ఆంజనేయులుతో కలిసి మోటార్ బైక్‌పై రేఖ తన కూతురు లింగంపేటకు బయలుదేరారు. లింగంపేట మరో రెండు కి.మీ., ఉండగా గోప్లాపూర్ స్టేజీ సమీపంలో ఎరువుల బస్తాల లోడ్‌తో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు బైక్‌పై వెనుక కూర్చున్న తల్లి రేఖ, కూతురు సాత్విక లారీ కిందపడ్డారు. దీంతో తల్లి, కూతురు తలలపై లారీ వెనుక టైర్లు వెళ్లడంతో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. బైక్ నడుపుతున్న ఆంజనేయులు డీజిల్ ట్యాంకుకు తగిలి మరో పక్కగా పడిపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పండగ పూట తల్లీకూతురు దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


ప్రమాదానికి కారణమైన లారీ

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే..

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీని ఓ పక్కగా ఖాళీ ఉండడంతో మోటార్ బైక్ ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బైక్ వస్తున్న వైపు మళ్లించడంతో బైక్‌పై ఒక పక్కగా కూర్చున్న మహిళ చీర లారీకి తగిలి.. తల్లి, ఆమెపై కూర్చున్న కూతురు ఒక్కసారిగా లారీ కిందకు జారిపడిపోయారని వాపోయారు. డ్రైవర్ అప్రమత్తంగా ఉండి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని బోరున విలపించారు. రేఖ మూడు నెలల గర్భిణి అని పేర్కొన్నారు.

సాయంత్రం దాక ఆందోళన

ప్రమాద విషయం తెలియగానే బాధిత కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్దఎత్తున ప్రమాద స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. రహదారిపై కంపచెట్లు వేసి రాకపోకలను అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ శివానందంగౌడ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించేందుకు ప్రయత్నించగా న్యాయం జరిగే వరకు మృతదేహాలను తరలించకుండా అడ్డుపడ్డారు. దీంతో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకుని పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం దాక ఆందోళన కొనసాగింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు, లారీ అసోసియేషన్ మధ్య చర్చలు జరిగిన అనంతరం సీఐ ఆదిరెడి హామీ మేరకు మృతదేహాలను పోస్టమార్టం నిమిత్తం బాదేపల్లి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని తర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం స్తంభించిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. ఈ సంఘటన గురించి ఎస్పీ జానకి పోలీసులకు ఫోన్ చేసి ఆరాతీశారు.

హైవే నిర్మాణానికి సహకరించాలి


గట్టులో రైతులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గట్టు: భారత్‌మాల ఆరు వరసల జాతీయ రహదారి నిర్మాణానికి రైతులు సహకరించాలని, నిర్మాణం పూర్తయితే గట్టు ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో హైవే అథారిటీ అధికారులు, కలెక్టర్ రైతులతో సమావేశమై మాట్లాడారు. భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి హైవే అథారిటీ అధికారులు రూట్ మ్యాపింగ్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించడంతో పాటు, మిగులు భూములకు సర్వీస్ రోడ్లు, బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రెండో విడత నష్ట పరిహారం మరో 10 రోజుల్లో అందించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. సర్వే నెంబర్ 300లో మాచర్ల నుంచి ఆరగిద్దకు లింకు రోడ్డు, బ్రిడ్జి, అండర్ పాస్‌ను నిర్మించాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం కార్యాలయ ఆవరణలో కలెక్టర్ మొక్క నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరితరాణి, ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్ కోటబాబు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

కొల్లాపూర్: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు. డిపోకు చెందిన బస్సు బుధవారం కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఓ ప్రయాణికురాలు బ్యాగును మర్చిపోయి జడ్చర్ల బస్టాండ్‌లో దిగిపోయింది. కొంతసేపటి తర్వాత విషయాన్ని గుర్తించి ఆమె జడ్చర్ల కంట్రోలర్‌కు సమాచారం తెలియజేసింది. ఆయన డ్రైవర్, కండక్టర్‌లకు ఫోన్‌చేశారు. డ్రైవర్ నాగరాజు, కండక్టర్ శ్రీనివాసులు బ్యాగును గుర్తించి భద్రపరిచారు. అదే రోజు రాత్రి ప్రయాణికురాలికి హైదరాబాద్ ఆర్టీసీ అధికారుల సమక్షంలో అందజేశారు. బ్యాగులో రూ.లక్ష విలువ చేసే నగలు, సెల్‌ఫోన్ ఉన్నాయి. విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గురువారం డ్రైవర్, కండక్టర్‌కు ఫోన్‌లో అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఆర్‌ఎం శ్రీదేవి, డీఎం ఉమాశంకర్ వారిని అభినందించారు.


ప్రయాణికురాలికి బ్యాగు అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సమాజాన్ని జాగృతం చేసేదే జానపదం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి


గురుకులంలో జానపద గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మహమ్మదాబాద్: సమాజాన్ని జాగృతం చేసేది జానపదం అని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్, జానపద కళారత్న, నృత్య చక్రవర్తి బిరుదు గ్రహీత చిగిచెర్ల కృష్ణారెడ్డి అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రపంచ జానపద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద సాహిత్యం, జానపద విజ్ఞానం ఎల్లప్పుడూ సమాజాన్ని తట్టిలేపుతాయన్నారు. జానపద కళారూపాలు కళా సంపదకు, సమాజం నడవడికకు జీవం పోసిందన్నారు. జానపదం పుట్టిందే శ్రమ నుంచి అని, పని పాటను ఏనాడూ విడదీయలేమని అన్నారు. జానపదాలు ప్రతిఒక్కరి నోట జాలువారుతాయని, జానపదం తెలుగునేల ప్రజల జీవన సంస్కృతిలో భాగమైందన్నారు. జానపదానికి సామాజిక అంశాలను జోడిస్తే ప్రజల చైతన్య కరదీపిక విలసిల్లుతుందన్నారు. బుర్రకథ, ఒగ్గుకథ డప్పు కోలాటం, పల్లెసుద్దులు, గంగిరెద్దులు వంటి అనేక కళారూపాలు ప్రస్తుతం విష సంస్కృతి ప్రభావంలో పడిపోయాయని, జానపద సాంస్కృతిక విధానం విధ్వంసం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి అంతరించిపోతున్న కళారంగానికి జీవం పోయాలని కోరారు. పాఠశాల స్థాయి నుంచే కళలపై మక్కువ పెంచి విద్యార్థులను చదువుతోపాటు కళాకారులుగా తయారు చేయవచ్చన్నారు. జానపద కళతో విద్యార్థులకు మానసిక ఒత్తిడి తగ్గి ప్రతిభావంతులుగా తయారవుతారని సూచించారు. అనంతరం విద్యార్థినులు డప్పు కోలాటం, వివిధ కళారూపాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల సంగీత ఉపాధ్యాయురాలు శ్యామల, కవయిత్రి పుష్పలత, నాట్యమండలి కార్యదర్శి సంతోష్, ప్రిన్సిపల్ అరుణ, సుజాత, శ్రీదేవి, రమ, వాసవి, హరిత తదితరులు పాల్గొన్నారు.

కోరిన వరాలిచ్చే 'గెల్వలాంబమాత'

- 24 నుంచి బ్రహ్మోత్సవాలు
- మూడు రోజులపాటు బోనాలు

వంగూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన గెల్వలాంబమాత ఉత్సవాలు ఈనెల 24 నుంచి 28 వరకు జరగనున్నాయి. ఉత్సవాలకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అలంకరణ, విద్యుద్దీకరణ, తాగునీరు, ప్రత్యేక బస్సులు రాకపోకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు అమ్మవారి మేలుకొలుపు, తోరణ అలంకరణ, గణపతి పూజలు, సాయంత్రం 5 గంటలకు నజర్ బోనాలు, వైశ్యుల బోనాలు అనంతరం బండ్లు, వాహనాలు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తాయి. ఆదివారం ఉదయం అమ్మవారికి గండ దీపాలు, సాయంత్రం రెడ్లు, పద్మశాలిలు, బోయ, గౌడ్లు, యాదవుల బోనాలు అమ్మవారికి సమర్పించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ, కోలాటాలు, భజనలు, సోమవారం ఉదయం పూజా కార్యక్రమాలు సాయంత్రం ముదిరాజ్‌ల బోనాలు, బండ్ల తిరుగుడు. 27 మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం, శ్రీకృష్ణ జననం, డోలారోహణం, 28 బుధవారం సాయంత్రం యాదవులచేత ఉట్లు కొట్టుట, బాలబాలికల చేత శ్రీకృష్ణ, గోపికల వేషధారణ. అనంతరం మహా మంగళహారతితో జాతర ముగుస్తుంది.


వంగూరులో కొలువుదీరిన గెల్వలాంబమాత

ఫోక్ సింగర్స్‌తో ప్రత్యేక కార్యక్రమం

25వ తేదీ ఆదివారం సాయంత్రం ఫోక్ సింగర్స్ నల్లగొండ నర్సన్న, మధుప్రియ, గంగ ఇతరులచే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవస్థాన కమిటీ సభ్యులు కోరారు.

అదృశ్యమైన మహిళ దారుణ హత్య?

జడ్చర్ల: అదృశ్యమైన మహిళ దారుణ హత్యకు గురైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన అనిత(45)ను హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో ఉన్న తన కూతురు శ్వేత దగ్గరకు పంపేందుకు ఈ నెల 17న భర్త జంగిరెడ్డి తన భార్య అనితను జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కించాడు. అయితే అదే రోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో కాటేదాన్‌లో ఉన్న కూతురు తండ్రికి ఫోన్ చేసి తన దగ్గరకు తల్లి రాలేదని చెప్పడంతో చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో జంగిరెడ్డి తన భార్య కనిపించడం లేదని 20న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే జంగిరెడ్డి ప్రవర్తనలో మార్పు కనిపించడంతోపాటు అతని బ్యాగులో పుస్తె, మెట్టెలు గమనించిన కుటుంబ సభ్యులు అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు జంగిరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా అదృశ్యమైన మహిళను హత్య చేసి పోలేపల్లి సెజ్ ప్రాంతంలోని డంపింగ్ యార్డులో పారవేసినట్లుగా సమాచారం. కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతుందని వివరాలు త్వర లో వెల్లడిస్తామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

లారీని ఢీకొన్న కంటైనర్: డ్రైవర్ దుర్మరణం

కొత్తకోట రూరల్: లారీని వెనుక నుంచి కంటైనర్ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కంటైనర్ బుధవారం రాత్రి కొత్తకోట టెక్కలయ్య దర్గా సమీపంలో జాతీయ రహదారి–44పై ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కంటైనర్ డ్రైవర్ శివనారాయణసింగ్(40)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు డ్రైవర్‌ను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గంట తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జడ్చర్లలో మరో సైబర్ నేరం

వైద్యుడినంటూ రూ.80 వేలు స్వాహా



జడ్చర్ల: పట్టణంలో ఇటీవల బియ్యం దుకాణం యజమాని దగ్గరకు వెళ్లి ధర అడిగి ఫోన్ తీసుకొని మాట్లాడి అంతలోనే రూ.99 వేలు స్వాహా చేసిన ఘటన మరువకముందే మరో వ్యాపారిని మాటలతో మభ్యపెట్టి దర్జాగా రూ.80 వేలు ఫోన్ పే నుంచి బ్యాంకు ఖాతాలోకి వేసుకొని మోసం చేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక నేతాజీ చౌరస్తాలో స్వప్న ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్న ఇమ్రాన్ సైడ్ బిజినెస్‌గా ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్ కూడా చేస్తారు. ఈ క్రమంలో ఓ అపరిచిత వ్యక్తి అతడికి ఫోన్‌చేసి తన పేరు రాజారెడ్డి అని.. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుడిగా పని చేస్తుంటానని.. తనకు పెట్రోల్ బంకులు తదితర వ్యాపారాలు ఉన్నాయని, ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్ రోజు అవసరం ఉంటుందని నమ్మబలికాడు. ప్రస్తుతానికి తనకు రూ.80 వేలు అత్యవసరంగా బదిలీ చేయాలని.. నగదును ఓ అబ్బాయి ద్వారా పంపిస్తున్నట్లు చెప్పాడు. అదే సమయంలో కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న ఓ హోటల్ మేనేజర్‌కు ఫోన్ చేసి తనకు వంద బిర్యానీలు కావాలని ప్యాక్‌చేసి ఇందుకు సంబంధించిన డబ్బును సూచించిన చెప్పుల దుకాణంలో తీసుకోవాలని చెప్పాడు. దీంతో మేనేజర్ ఓ అబ్బాయిని సంబంధిత దుకాణం వద్దకు డబ్బు కోసం పంపించగా.. అదే సమయంలో ఇమ్రాన్‌కు అపరిచిత వ్యక్తి మరోమారు ఫోన్‌చేసి తమ అబ్బాయి మీ దగ్గరకు వచ్చాడని.. వెంటనే డబ్బు బదిలీ చేయాలని తొందరపెట్టాడు. దీంతో అపరిచిత వ్యక్తి ఇచ్చిన మూడు నంబర్లకు ఫోన్‌పే ద్వారా రూ.65 వేలు, బ్యాంకు ఖాతా నుంచి రూ.15 వేలు బదిలీ చేశాడు. తర్వాత తన ముందున్న అబ్బాయిని డబ్బు అడగగా తాను హోటల్ నుంచి వచ్చానని.. తమకు ఆర్డర్ చేసిన బిర్యానీ డబ్బులు ఇక్కడే తీసుకోమని ఓ వ్యక్తి ఫోన్ చేయడంతో వచ్చినట్లు చెప్పాడు. ఒక్కసారిగా ఖంగుతిన్న ఇమ్రాన్ వెంటనే తనకు వచ్చిన నంబర్లకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేఎల్ఐ డీ–5 కాల్వకు గండి

గోపాల్‌పేట: ఏదుల, రేవల్లి మధ్యలో ఉన్న కేఎల్ఐ డి–5 కాల్వకు గురువారం తెల్లవారు జామున గండి పడటంతో నీరంతా పొలాల్లోకి చేరింది. కొన్నిరోజుల కిందట కట్ట మీది నుంచి నీరు పారుతుండగా అధికారులు తాత్కాలికంగా మట్టి వేశారు. ప్రస్తుతం అక్కడే కాల్వ మీదుగా నీరు పారి గండిపడి పక్కనే ఉన్న రైతుల వరి పంటల్లోకి ఇసుక కొట్టుకొచ్చింది. ముందే జాగ్రత్త పడి ఉంటే ఇలా జరిగేది కాదని.. నష్టపోయిన పంటకు ప్రభుత్వం పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.


వరి పంటలోకి కొట్టుకొచ్చిన ఇసుక

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు/ దోమలపెంట/ రాజోళి/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కొనసాగుతుందని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 5 క్రస్టు గేట్లను ఎత్తి 20,590 క్యూసెక్కులు, జల విద్యుదుత్పత్తి ద్వారా 38,043 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అలాగే నెట్టెంపాడుకు 1,500, కుడి కాల్వకు 600, ఎడమ కాల్వకు 550, కోయిల్‌సాగర్‌కు 630, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు వదలగా.. మరో 95 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.909 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

⇨ ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద 15 గేట్లను ఎత్తి 50,660 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.05 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 883.5 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో గురువారం 883.5 అడుగుల వద్ద 207.4103 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువనున్న జూరాల, సుంకేసులతోపాటు హంద్రీ నుంచి 1,18,923 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వసస్తుంది. దీంతో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 23,574 కలిపి మొత్తం 61,456 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే పోతిరెడ్డిపాడు ద్వారా 30 వేల క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,520 క్యూసెక్కుల నీటిని వదిలారు.


జూరాల ప్రాజెక్టు వద్ద 5 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. గురువారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 165.375 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

సుంకేసులకు గురువారం వరద తగ్గుముఖం పట్టింది. బుధవారం 21 గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు, గురువారం 10 గేట్ల ద్వారా మాత్రమే నీటిని దిగువకు వదిలారు. ఎగువ నుంచి 47,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 44,790 క్యూసెక్కులను దిగువకు.. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ



మరికల్: పట్టపగలు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన గురువారం చిత్తనూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మరికల్ మండలం చిత్తనూర్‌కు చెందిన బత్తుల రవి గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి లోపలికి వెళ్లారు. బీరువా తాళం పగులగొట్టి 9 తులాల బంగారం, 20 తులాల వెండి, 14 జతల చైన్‌లు, రూ.లక్ష నగదు చోరీ చేశారు. ఇంటికి వచ్చిన రవి చోరీ జరిగిన విషయం తెలుసుకొని వెంటనే మరికల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన డీఎస్పీ లింగయ్య, సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మురళిలు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్సుడు తోటకు గడ్డి మందు పిచికారీ

- రూ.1.50 లక్షల నష్టం

లింగాల: మండలంలోని దత్తారం గ్రామంలో చిక్కుడు తోటకు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లింది. బాధితుడు రాజల్‌రెడ్డి కథనం మేరకు.. తాను కూరగాయలు సాగు చేస్తూ జీవనం సాగించే వాడిననని, ఇది జీర్ణించుకోలేని గుర్తు తెలియని వ్యక్తులు ఎకరా తోటకు గడ్డిమందు పిచికారీ చేయగా పూర్తిగా ఎండిపోయిందని వివరించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.